
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024



కలల వారధి సాకారం

వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మాణ కల త్వరలో సాకారం కానుంది. పనులకు టెండర్లను జూన్‌లో తెరవనున్నారు. 8లో ▸



వలసల జోరు

ఎన్నికల సమీపిస్తున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



కోడలిని హతమార్చిన మామ

రోకలి బండతో కొట్టి కోడలిని మామ హతమార్చిన ఘటన తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో చోటుచేసుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

టీడీపీకి ఊడిగం చేసేందుకే పవన్ పార్టీ

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



రోడ్డుషోలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, కనకసుందర్రావు

పెంటపాడు: టీడీపీకి ఊడిగం చేసేందుకే పవన్ జనసేన పార్టీ పెట్టారని, ఆ కూటమికి ఓటు వేస్తే రాష్ట్రం అథోగతి పాలవుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, ప్రత్తిపాడు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనకసుందర్రావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు మాట్లాడుతూ రాష్ట్రాన్ని 14 ఏళ్లు పాలించానని గొప్పలకు పోతున్న చంద్రబాబు అండ్ కూటమిని ప్రజలు చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీరుపై మండిపడ్డారు. పవన్‌ను అడ్డు పెట్టుకొని చంద్రబాబు సీఎం జగన్‌పై యుద్ధం చేస్తున్నాడన్నారు. వలంటీర్లను దేశద్రోహులుగా కూటమి నాయకులు చిత్రించడం దారుణమన్నారు. చంద్రబాబు ఇస్తున్న ప్యాకేజీలకు పవన్ అమ్ముడుపోయారని, జనసేన శ్రేణులు పవన్‌ను నిలదీయాలన్నారు. జనసేన పార్టీ కార్యకర్తలకు ఎన్నడూ న్యాయం జరగలేదని, టీడీపీకి దాసోహం అంటూ వారిని కట్టుబానిసలుగా పవన్ చేశారన్నారు. కుల, మత, రాజకీయాలకు చూడకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీడీపీ, జనసేన పార్టీల వారికి కూడా పథకాలన్నీ అందించామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనకసుందర్రావులు మాట్లాడారు.

ఓటమి భయంతోనే రఘురామ అవాకులు

ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్



పెదకాపవరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు

ఆకివీడు: పార్టీ అంతర్గత కలహాలు, ప్రత్యర్థిని ఎదుర్కోలేక మానసిక ఒత్తిళ్లకు గురై మతిస్థిమితం లేకుండా టీడీపీ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు అవాకులు, చవాకులు పేలుతున్నారని వైఎస్సార్‌సీపీ ఉండి అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు ధ్వజమెత్తారు. మండలంలోని పెదకాపవరంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కటారి జయలక్ష్మి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ మూడు ముక్కలు ఆరు చెక్కలుగా ఉందని ఎద్దేవాచేశారు. స్వతంత్ర అభ్యర్థికి డబ్బులు ఇచ్చి పోటీలో నిలబెట్టే సంస్కృతి తమది కాదని, కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోటు రాజకీయాలు టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. తనకు ప్రజా అండదండలు మెండుగా ఉన్నాయని, పోటీలో ఉన్న ఏ అభ్యర్థీ తనకు మద్దతు కాదన్నారు. ఎనిమిదేళ్లుగా ప్రతి ఇంట్లో కుటుంబసభ్యుడిగా నిత్యం కలుస్తున్నానన్నారు. గత ఎన్నికల్లో గెలిచి అడ్రస్ లేకుండా పోయిన నాయకులకు ఇప్పుడు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ప్రజాసేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఆస్తులు కూడబెట్టేందుకు కాదన్నారు. ఎన్నికల్లో అఖండ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారని స్పష్టం చేశారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

ఐఆర్‌సీటీసీ అయోధ్య యాత్ర

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో అయోధ్య-ముక్తినాథ్ (నేపాల్) చార్టర్ కోచ్ యాత్రని వచ్చేనెల 6న ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 6న యాత్ర ప్రారంభమై 18న సాయంత్రానికి పూర్తి అవుతుందని పేర్కొన్నారు. 12 రాత్రులు, 13 రోజులు ఈ యాత్రలో అయోధ్య, ఖాట్మాండు, ముక్తినాథ్, పోఖారా ప్రాంతాలను సందర్శించవచ్చని తెలిపారు. యాత్ర 6న రామనాథపురం నుంచి ప్రారంభమై గూడూరు, విజయవాడ మీదుగా సాగుతుందన్నారు. ఒక టికెట్ రూ.72,500, ఇద్దరు కలిసి వస్తే ఒక్కో టికెట్‌కు రూ.57,600, ముగ్గురు కలిసి వస్తే ఒక్కో టికెట్‌కు రూ.56,500 చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్టీసీ ఉందన్నారు.

పేదల విద్యకు ఊతం

- అమ్మఒడి సాయం రూ.17 వేలకు పెంపు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- మేనిఫెస్టోలో ప్రకటించిన సీఎం జగన్
- జిల్లాలో 1.48 లక్షల మందికి రూ.888 కోట్ల లబ్ధి
- వచ్చే ఐదేళ్లలో అందించనున్న సాయం రూ.1,261 కోట్లు
- సర్వత్రా హర్షాతిరేకాలు

అమ్మఒడీ చల్లగా..

చదువుకు పేదరికం అడ్డు రాకూడదు. ప్రతి తల్లీ తన బిడ్డలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారు. ఏటా ఈ పథకం కింద విద్యార్థుల తల్లులకు రూ.15 వేల చొప్పున సాయం అందిస్తుండగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ మొత్తాన్ని రూ.17 వేలకు పెంచనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చారు.

జిల్లాలో అమ్మఒడి సాయం	సంవత్సరం	2020	2021	2022	2023
	లబ్ధిదారులు	1,47,900	1,51,401	1,50,536	1,43,534
	సాయం (రూ.కోట్లలో)	రూ. 221.0 కోట్లు	రూ. 226.9 కోట్లు	రూ. 224.6 కోట్లు	రూ. 215.4 కోట్లు





సాక్షి, భీమవరం: పేదవర్గాల వారు తమ పిల్లలను చదివించేందుకు ఇబ్బంది పడేవారు. కొందరు మధ్యలోనే చదువులు మాన్పించేసి పిల్లలను పనులకు పంపేవారు. పేదల విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చిన సీఎం జగన్ అమ్మఒడి పథకం ద్వారా వారి చదువులకు భరోసా కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే తల్లుల ఖాతాలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున అందజేస్తున్నారు. రూ.2 వేలు పాఠశాలల అభివృద్ధికి వెచ్చిస్తుండగా మిగిలిన రూ.13 వేలు నేరుగా తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారు. గత నాలుగు విడతల్లో పశ్చిమగోదావరి జిల్లాలో 1,48,342 మంది తల్లుల ఖాతాలకు మొత్తంగా రూ.887.9 కోట్లు జమ చేశారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజుల అవసరాల కోసం వీటిని వినియోగిస్తుండగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లులకు అదనపు సాయంగా ఉపయోగపడుతుంది. ఈ మొత్తాన్ని కొందరు పిల్లల భవిష్యత్తు కోసం బ్యాంకులు, పోస్టాఫీసుల్లో డిపాజిట్లు చేసుకోవడం, ఆడబిడ్డలకు బంగారు వస్తువులు కొనుగోలు చేయడం వంటివి చేస్తున్నారు.

రూ.17 వేలకు పెరగనున్న సాయం : వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమ్మఒడి సాయాన్ని రూ.17 వేలకు పెంచనున్నట్టు సీఎం జగన్ మేనిఫెస్టోలో ప్రకటించారు. పాఠశాల మెయింటినెన్స్ నిమిత్తం రూ.2 వేలు పోను మిగిలిన రూ.15 వేలు తల్లుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఈ మేరకు వచ్చే ఐదేళ్లలో రూ.85 వేలు అందిచనున్నట్టు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 1,48,342 మంది లబ్ధిదారులు ఉండగా తాజా పెంపుదల మేరకు ఐదేళ్లలో రూ.1,261 కోట్ల ప్రభుత్వ సాయం అందనుంది. తాజా పెంపుదల ద్వారా రూ.146 కోట్లు మేర ప్రభుత్వంపై అదనపు భారం పడుతుంది.

మేనిఫెస్టోలో మరిన్ని..

- వచ్చే ఐదేళ్లలో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన పథకాల కొనసాగింపు.
- అన్ని ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తూ మనబడి నాడు-నేడు కొనసాగింపు, అన్ని హాస్టళ్లు, అంగన్‌వాడీలు, డిగ్రీ కళాశాలల రూపురేఖలు మారుస్తాం.
- 2025 నుంచి ఒకటో తరగతికి ఐబీ విద్యా విధానం. ఇలా ఏటా ఒక తరగతి పెంచుకుంటూ 2035 నాటికి 10వ తరగతికి విద్యార్థులకు ఐబీ, రాష్ట్ర బోర్డుల జాయింట్ సర్టిఫికేషన్.
- 8వ తరగతి విద్యార్థులకు ఏటా ట్యాబ్‌లు అందజేసే కార్యక్రమం కొనసాగింపు.
- 18 యూనివర్సిటీల్లో కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్న 3,295 అధ్యాపక పోస్టుల భర్తీ చేసే ప్రక్రియను కోర్టు కేసులు అధిగమించి చేపట్టాం. భర్తీని త్వరితగతిన పూర్తి చేస్తాం.
- డిజిటల్ ఎడ్యుకేషన్‌తో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడం.

జగనన్న చెప్పారంటే చేస్తారంతే..



సీఎం జగనన్న హామీ ఇచ్చాడంటే కచ్చితంగా అమలుచేస్తారు. అమ్మఒడి సాయం పెంచడం పేదల విద్యకు మరింత భరోసా అవుతుంది. ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతల్లో అమ్మఒడి సాయం అందించారు. వచ్చే ఐదేళ్లలోనూ తప్పకుండా హామీ అమలుచేస్తారు.
– పోతుముడి దుర్గ, సిద్ధాంతం

పెంపు అభినందనీయం



అమ్మఒడి రూ.17 వేలకు పెంచడం అభినందనీయం. దీనివలన ఎంతోమంది పేద మహిళలకు చాలా మేలు జరుగుతుంది. ఇప్పటివరకు అమ్మఒడి సాయాన్ని నాలుగుసార్లు తీసుకున్నాను. సీఎం జగన్ పాలనలో మరో ఐదేళ్ల పాటు ఈ పథకం పేదలకు అందనుంది.
– కె.లక్ష్మి, తాడేపల్లిగూడెం.

అంకితభావానికి నిదర్శనం



మా పిల్లలిద్దరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. అమ్మఒడి మాకు ఎంతో ఆసరాగా నిలిచింది. ఈ సాయాన్ని మరో రూ.2 వేలు పెంచుతూ జగనన్న తీసుకున్న నిర్ణయం ఆయన అంకితభావానికి నిదర్శనం. ప్రజా శ్రేయస్సు కోరే ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.
– వర్థినీడి కుసుమకుమారి, పాలకొల్లు

పేదలకు వరం



అమ్మఒడి పథకం పేద విద్యార్థుల ఉన్నత చదువులకు గొప్పవరంలా ఉంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రూ.17 వేలకు పెంచుతూ మేనిఫెస్టోలో చేర్చడం చాలా మంచి నిర్ణయం. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ఈ పెంపు పేదల విద్యకు ఉపయోగపడుతుంది.
– సరెళ్ల వనిత, తేతలి, తణుకు మండలం

ఆర్థిక ఆసరాగా..



అమ్మఒడి పథకం మా కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలిచింది. ఈ మొత్తంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా పిల్లలను చదివించుకోగలుగుతున్నాం. ఈ సాయాన్ని రూ.17 వేలకు పెంచడం ద్వారా తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమచేస్తారని చెప్పడం అభినందనీయం.
– మంచెం దుర్గాభవాని, కొంతేరు, యలమంచిలి మండలం

చాలా ఆనందంగా ఉంది



సీఎం జగన్ మేనిఫెస్టోలో అమ్మఒడి కింద ఇకపై రూ.17 వేలు ఇస్తామనడం చాలా ఆనందంగా ఉంది. అల్పాదాయ వర్గాలకు ఇది పెద్ద ఊరట. బడికి పిల్లలను పంపించడానికి ఇది దోహదం చేస్తుంది. జగన్ మావయ్య మమ్మల్ని చదివిస్తున్నారని పిల్లలు సంతోషపడుతున్నారు.
– ఉర్ల ఆశ, కుంచనపల్లి, తాడేపల్లిగూడెం మండలం

మాకొద్దు టీడీపీ కేడర్!

- గత ఎన్నికల్లో సొమ్ముల స్వాహాపై అంతర్మథనం
- ఈసారి ఎన్నికలకు టీడీపీ శ్రేణులను దూరం పెట్టిన వైనం
- సొంత మనుషులతోనే జనసేన అభ్యర్థి ప్రచారం

భీమవరం: బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబును ప్రజలంతా నిన్ను నమ్మంబాబూ అంటుంటే.. భీమవరం జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాత్రం టీడీపీ నాయకులను నమ్మే పరిస్థితి లేదని పలువురు అంటున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన అంజిబాబు ఓటర్లకు పంపిణీ కోసం ఇచ్చిన సొమ్మును సైతం తెలుగుదేశం పార్టీ నాయకులు స్వాహా చేయడంతో పోలింగ్ రోజున ఓటర్లు ఆ పార్టీ కార్యాలయానికి వచ్చి గందరగోళం సృష్టించారు. అప్పటి ఎన్నికల్లో అంజిబాబు ఘోరంగా ఓడిపోగా ఆయనకు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానం నెరవేర్చకపోవడంతో ఐదేళ్లుగా పార్టీకి దూరంగా ఉంటూ వ్యాపార, వ్యవహారాలు చక్కబెట్టుకున్నారు. దీంతో భీమవరం నియోజకవర్గంలో టీడీపీ చుక్కాని లేని నావలా మారింది. ఇదిలా ఉండగా ప్రస్తుత ఎన్నికల్లో అంజిబాబు జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. పార్టీలు మారడంలో దిట్ట అనే ముద్ర వేసుకున్న అంజిబాబు నుంచి అందిన కాడికి అందిపుచ్చుకోవాలనే ప్రయత్నాలు టీడీపీ శ్రేణులు ప్రారంభించినట్టు ప్రచారం జరుగుతోంది. ఎంతో కొంత ఆయన నుంచి చేజిక్కుంచుకోకపోతే ఇంతకాలం పార్టీ కోసం పనిచేస్తున్నందుకు ప్రయోజనం ఏంటనే నిర్ణయానికి టీడీపీ శ్రేణులు వచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే టీడీపీ ముఖ్య నాయకులు అంజిబాబు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండగా ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు సొమ్ముల కోసం జనసేన పార్టీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారంట.

సొంత మనుషులతోనే కార్యాచరణ

టీడీపీ, జనసేన నాయకులు ఎన్నికల్లో పెత్తనం చేయడానికి ప్రయత్నించగా గత అనుభవాల దృష్ట్యా అంజిబాబు జాగ్రత్త పడినట్లు చెబుతున్నారు. దీంతో నామినేషన్ కార్యక్రమానికి జనాన్ని తరలించడం దగ్గర నుంచి ఎన్నికల ప్రచార వ్యవహారాలు కూడా తన బంధువులు, కావాల్సిన వారితోనే చేయిస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా డబ్బులు విషయంలో అంజిబాబు అతి జాగ్రత్తగా వ్యవహరించడం టీడీపీ, జనసేన కేడర్‌కు మింగుడు పడటంలేదు. ఎన్నికల్లో ఓడిపోతే అంజిబాబు పత్తా ఉండరు కాబట్టి అయినకాడికి దండుకునే ప్రయత్నాలను కేడర్ చేస్తున్నట్టు తెలిసింది. దీంతో సొంత మనుషులతోనే అంజిబాబు ఎన్నికల కార్యాచరణ రూపొందించినట్టు సమాచారం.

జనసేన శ్రేణుల చిందులు

నరసాపురం: పట్టణంలోని దర్గా సెంటర్‌లో జనసేన ప్రచార కార్యక్రమంలో ఇద్దరు జర్నలిస్టులపై ఆ పార్టీనాయకులు అసభ్య పదజాలంతో దూషణలు దిగడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం డ్యాన్ మాస్టర్ శేఖర్ దర్గా సెంటర్‌లో జనసేన తరఫున ప్రచార కార్యక్రమానికి వచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో కవరేజీకి వెళ్లిన ఓ పత్రిక విలేకరి, మరో న్యూస్ చానల్ జర్నలిస్ట్‌పై అక్కడున్న జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ కెమెరామెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫొటోలకు అడ్డువస్తున్నారు, మీరు ఎవరు? అంటూ రుసరుసలాడాడు. తాము జర్నలిస్టులమని చెప్పబోతుండగా.. జర్నలిస్టులైతే ఐడీ కార్డులు వేసుకుని తిరగాలని గర్జించారు. 'నేనవరు అనుకుంటున్నావు.. నాయకర్ కెమెరామెన్‌ని, కాబోయే మంత్రి మనిషిని' అంటూ శివాలెత్తారు. ఇప్పటికే నాయకర్ వ్యవహార తీరుపై నియోజకవర్గంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా నాయకర్ అనుయాయుల దురుసు ప్రవర్తనతో ముందుకు వెళుతున్నారు. జనసేన తీరుపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి.

తుది జాబితా రెడీ

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- ఏలూరు జిల్లాలో 99 మంది..
- పశ్చిమగోదావరి జిల్లాలో 110 మంది పోటీలో..
- ప్రధాన పార్టీలతో పాటు ప్రతిచోటా స్వతంత్రులు
- ఇండిపెండెంట్లకు గుర్తుల కేటాయింపు పూర్తి
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వీరే..



గూడూరి ఉమాబాల నరసాపురం ఎంపీ అభ్యర్థి



కొట్టు సత్యనారాయణ, తాడేపల్లిగూడెం



కారుమూరి నాగేశ్వరరావు, తణుకు



ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం



చెరుకువాడ శ్రీరంగ నాథరాజు, ఆచంట



గ్రంధి శ్రీనివాస్, భీమవరం



పీవీఎల్ నర్సింహరాజు, ఉండి



గుడాల శ్రీహరిగోపాల రావు, పాలకొల్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ పూర్తి చేసి బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను, ఎన్నికల గుర్తులను రిటర్నింగ్ అధికారులు సోమవారం కేటాయించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు బరిలో నిలిచారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి 13 మంది, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి 21 మంది బరిలో ఉండగా ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 86 మంది, పశ్చిమగోదావరి జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాల నుంచి 89 మంది పోటీలో ఉన్నారు.

నేడు అభ్యర్థులతో సమావేశం

ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు అధికారులు ఎన్నికల గుర్తులు కేటాయించారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, రెండు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించారు. 26న నామినేషన్ల పరిశీలన నిర్వహించి సోమవారం వరకు ఉపసంహరణకు తుది గడువు ఇచ్చారు. సాయంత్రం 3 గంటల తర్వాత రెండు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థులు గుర్తులు కేటాయింపు పూర్తి చేశారు. అలాగే మంగళవారం ఉదయం 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులతో కలెక్టర్లు సమావేశం నిర్వహించి ఎన్నికల నియమావళిని వివరించనున్నారు.

ప్రచార పర్వంలో వైఎస్సార్‌సీపీ ముందంజ

అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎన్నికల క్షేత్రంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నుంచి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గూడూరి ఉమాబాల బరిలో నిలిచారు. ఏలూరు జిల్లాలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల నాని, గోపాలపురం నియోజకవర్గం నుంచి హోం మంత్రి తానేటి వనిత, ఉంగుటూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, కైకలూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, నూజివీడులో సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు, దెందులూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, చింతలపూడిలో కంభం విజయరాజు, పోలవరంలో తెల్లం రాజ్యలక్ష్మి భారీ ర్యాలీగా నామినేషన్లు దాఖలు చేసి ప్రచార పర్వంలో దూసుకు వెళుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆచంట నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నరసాపురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, భీమవరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ గ్రంధి శ్రీనివాస్, పాలకొల్లు నుంచి గుడాల గోపి, ఉండి నుంచి పీవీఎల్ నర్సింహరాజు ప్రచార పర్వంలో ముందంజలో ఉన్నారు.

ఏలూరు జిల్లా..

- **ఏలూరు పార్లమెంట్** నియోజకవర్గ స్థానానికి 17 **నామినేషన్లు దాఖలు కా**గా 4 డమ్మీ నామినేషన్లను **తిరస్కరించడంతో 13** మంది బరిలో నిలిచారు.
- **ఉంగుటూరు అసెంబ్లీ** నియోజకవర్గం నుంచి 16 **నామినేషన్లు స్వీకరించ**గా ఒకటి తిరస్కరణకు గురి **కాగా, ముగ్గురు ఉపసం**హరించుకున్నారు. దీంతో **12 మంది ఎన్నికల బరి**లో ఉన్నారు.
- **దెందులూరు అసెంబ్లీ** నియోజకవర్గం నుంచి 18 నామినేషన్లకుగాను 3 నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో 15 మంది బరిలో నిలిచారు.
- ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 16 నామినేషన్లకు గాను ఒకటి తిరస్కరణ, మరొకటి ఉపసంహరణతో 14 మంది ఎన్నికల బరిలో ఉన్నారు.
- పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 23 నామినేషన్లకుగాను 10 తిరస్కరణ, ఒకటి ఉపసంహరణ కాగా, 12 మంది పోటీలో ఉన్నారు.
- చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 13 నామినేషన్లకుగాను 3 తిరస్కరణ, ఒకటి ఉపసంహరణతో 8 మంది పోటీలో ఉన్నారు.
- నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 నామినేషన్లకుగాను 3 తిరస్కరణ, 2 ఉపసంహరణతో 10 మంది బరిలో ఉన్నారు.
- కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 23 నామినేషన్లకుగాను 5 తిరస్కరణ, 3 ఉపసంహరణతో 15 మంది పోటీలో ఉన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా

- నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 27 మంది అభ్యర్థులు 39 సెట్లు దాఖలు చేయగా పరిశీలన అనంతరం ఆరుగురు అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణతో 21 మంది బరిలో నిలిచారు.
- ఆచంట అసెంబ్లీ నియోజకవర్గంలో 11 మందికిగాను ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 9 మంది పోటీలో ఉన్నారు.
- పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో 16 నామినేషన్లకుగాను ఒకరు ఉపసంహరించుకోవడంతో 15 మంది పోటీలో ఉన్నారు.
- నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 12 నామినేషన్లకుగాను ఒకరు ఉపసంహరించుకోవడంతో 11 మంది పోటీలో ఉన్నారు.
- భీమవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 17 నామినేషన్లకుగాను ఇద్దరు ఉపసంహరించుకోవడంతో 15 మంది పోటీలో ఉన్నారు.
- ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో 17 నామినేషన్లకు గాను 4 ఉపసంహరించుకోవడంతో 13 మంది బరిలో ఉన్నారు.
- తణుకు అసెంబ్లీ నియోజకవర్గంలో 13 నామినేషన్లకుగాను 13 మంది పోటీలో నిలిచారు.
- తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలో 13 నామినేషన్లకుగాను 13 మంది ఎన్నికల పోటీలో ఉన్నారు.

బరిలో నిలిచిన అభ్యర్థులు

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం	13 మంది
నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం	21 మంది
ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు	86 మంది
పశ్చిమగోదావరిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు	89 మంది

కలల వారధి త్వరలో సాకారం

క్లుప్తంగా

రోకలి బండతో కోడలిని హతమార్చిన మామ



లక్కోజు నాగశ్రీవాణి మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్ : రోకలి బండతో కొట్టి కోడలిని మామ హతమార్చిన ఘటన జగన్నాథపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగన్నాథపురం గ్రామానికి చెందిన లక్కోజు శ్రీనివాసరావు, నాగశ్రీవాణి (25)లకు 2020లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. భర్త శ్రీనివాసరావు ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. నాగశ్రీవాణి తన అత్తమామలతో కలిసి నివసిస్తోంది. అయితే నాగశ్రీవాణి తరచూ పిల్లలను కొడుతుండటంతో అత్తమామతో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి గొడవ జరిగి మామ కేశవరావు రోకలిబండతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే నాగశ్రీవాణి మృతి చెందింది. ఆమె మృతి చెందిన విషయం తెలుసుకున్న తండ్రి మేటూరి శ్రీనివాసాచార్యులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. మామ కేశవరావు, మరో నలుగురు కలిసి వేధిస్తున్నారంటూ కుమార్తె తనకు చెప్పిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తన కుమార్తెను హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. మామ కేశవరావు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, రూరల్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- నరసాపురం వశిష్ట వంతెన టెండర్లు జూన్‌లో ఓపెన్
- టెండర్లు ఖరారు కాగానే ప్రారంభం కానున్న పనులు
- నిర్ణీత కాల వ్యవధిలో నిర్మాణం పూర్తికి నిర్ణయం
- రూ.591.71 కోట్లతో రాజుల్లంక వద్ద బ్రిడ్జి నిర్మాణం
- మరో రూ.60 కోట్ల వ్యయంతో స్థల సేకరణ పూర్తి

వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మాణ కల త్వరలో సాకారం కానుంది. ఇప్పటికే వంతెన పనులకు టెండర్లు పిలిచారు. వచ్చిన టెండర్లను జూన్‌లో తెరవనున్నారు. టెండర్లు ఖరారు కాగానే పనులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా ఈ అంశంపై దృష్టి పెట్టడం, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేయడంతో వంతెన నిర్మాణానికి అడుగు ముందడుగు పడింది. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ద్వారా రూ.591.71 కోట్ల నిధులతో వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. న్యూఢిల్లీలోని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో బిడ్స్ ఓపెన్ చేసి పనులు ఖరారు చేస్తారు. అంతేకాకుండా నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నారు.





నరసాపురం వశిష్ట రేవులో పంటుపై రాకపోకలు , సఖినేటిపల్లిలో వైఎస్సార్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

నరసాపురం: ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ ప్రస్తుతం అటు కోనసీమ, ఇటు పశ్చిమగోదావరి జిల్లాల మధ్య వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మించాలనేది దశాబ్దాల డిమాండ్. బ్రిటీష్ హయాంలో అంకురార్పణ జరిగిన ఈ వంతెన నిర్మాణం దశాబ్దాలుగా కలగానే మిగిలిపోయింది.

దశాబ్దాల డిమాండ్

వశిష్ట వారధి నిర్మాణానికి రూ.590 కోట్లు, స్థల సేకరణకు రూ.60 కోట్లు మొత్తంగా రూ.650 కోట్లు ఖర్చు చేస్తున్నారు. స్థల సేకరణ పూర్తి ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించింది. ఇదిలా ఉంటే వంతెన పనులు ముందుకు వెళ్లకుండా ప్రతిపక్ష పార్టీలు పలుమార్లు కోర్టులకు వెళ్లాయి. దీంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి.

కేంద్రం సహకారంతో..

రూ.591.71 కోట్ల అంచనాతో నరసాపురం మండలం రాజుల్లంక గ్రామం వద్ద వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. కోనసీమ జిల్లా చించినాడ మీదుగా నరసాపురం నుంచి ఒంగోలు వరకు నిర్మించిన 216 జాతీయ రహదారికి బైపాస్ నిర్మించడం ద్వారా వంతెన నిర్మాణం చేయించాలని ఆలోచన చేశారు. కోనసీమ జిల్లా శివకోడు నుంచి టేకిశెట్టిపాలెం మీదుగా ఉన్న స్టేట్‌హైవేను జాతీయ రహదారిగా మార్పుచేసి రామేశ్వరం మీదుగా ఇటు పశ్చిమగోదావరి జిల్లాలోని రాజుల్లంక, వైఎస్ పాలెం, సీతారామపురం మీదుగా 216 జాతీయ రహదారికి బైపాస్ హైవే రోడ్డు నిర్మించనున్నారు. మధ్యలో కోనసీమ జిల్లా రామేశ్వరం, ఇటు నరసాపురం మండలం రాజుల్లంక వద్ద వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

సీఎం వైఎస్ జగన్ లేఖతో..

చించినాడ 216 జాతీయ రహదారికి కోనసీమ జిల్లా నుంచి నరసాపురం వరకూ బైపాస్ నిర్మించి, మధ్యలో వంతెన నిర్మిస్తే ఈ ప్రాజెక్ట్‌కు మోక్షం కలుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యమంత్రికి పలుమార్లు వివరించారు. బ్రిటీష్ హయాం నుంచి వంతెన విషయంలో జరిగిన మలుపులు, వంతెన నిర్మించడం వల్ల స్థానికంగా జరిగే ఓఎన్‌జీసీ కార్యకలాపాలు, మత్స్య, కొబ్బరి ఎగుమతుల వృద్ధి, తీరప్రాంతం అభివృద్ధి వంటి కీలక ప్రయోజనాలను సీఎం వద్ద ప్రస్తావించారు. దీంతో సీఎం వైఎస్ జగన్ కేంద్ర మంత్రి నితిన్‌గట్కరీకి లేఖ రాయడం, శివకోడు సఖినేటిపల్లి మీదుగా రామేశ్వరం నుంచి నరసాపురం వరకూ 25 కిలోమీటర్ల మేర స్టేట్ హైవేను 216కు బైపాస్‌గా నేషనల్ హైవేగా మార్పు చేయాలని, మధ్యలో రాజుల్లంకవద్ద గోదావరిపై వంతెన నిర్మించాలని లేఖలో కోరారు. సీఎం జగన్ లేఖకు స్పందించిన గట్కరీ వెంటనే ఆమోదం చెప్పడంతో దశాబ్దాల వంతెన సమస్యకు లైన్ క్లియర్ అయ్యింది. మొత్తం 380 మీటర్ల మేర వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేశారు. స్థల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రూ.60 కోట్లు మంజూరు చేయడం, స్థల సేకరణ పూర్తి చేయడం జరిగాయి.

జగన్ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని..

ఈ ఏడాది వశిష్ట వంతెన పనులు మొదలు కాబోతున్నాయని తెలియగానే ప్రభుత్వానికి పేరు ఎక్కడ వస్తుందోనని ప్రతిపక్షాలు కుట్రలు మొదలుపెట్టాయి. స్థల సేకరణ అంశంలో కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. అయితే చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గట్టి ప్రయత్నం చేసి స్టేను వెకేట్ చేయించి, ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించాలని నిర్ణయించారు. తీరా ముఖ్యమంత్రి 2022 నవంబర్ 21వ తేదీన నరసాపురం పర్యటన దగ్గరికి వచ్చే సమయానికి మళ్లీ రెండోసారి కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. పదేపదే అడ్డంకులు కల్పించినా రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన చిక్కులు లేకుండా చూసుకుని వంతెన పనులను టెండర్ల దశకు తీసుకొచ్చింది. లేదంటే వశిష్ట వంతెన పనులు ఇప్పటికే మొదలయ్యేవి.

మహానేత వైఎస్సార్ ఉండి ఉంటే..

ఎన్టీఆర్ తరువాత నరసాపురం వశిష్ట వంతెనకు బీజం వేసింది మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి. వైఎస్ 2008 ఏప్రిల్ 16న తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లిలో వశిష్ట వంతెనకు శంకుస్థాపన చేశారు. వెంటనే టెండర్లు పలిచి రూ.194 కోట్లతో పనులు సత్యం కంపెనీకి చెందిన నిర్మాణ సంస్థ మైథాస్‌కు అప్పటించారు. సర్వే పూర్తయి పనులు ప్రారంభం అయ్యే సమయానికి సత్యం సంస్థ సంక్షోభంలో చిక్కుకుని పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ పనులను వైఎస్సార్ వేరే కంపెనీకి అప్పగించారు. దీంతో మళ్లీ ఈ అంశం కోర్టుకెక్కింది. 2014 నుంచి అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కోర్టులో స్టే వెకేట్ చేయించే ప్రయత్నం కూడా చేయకుండా, వంతెన కట్టేస్తున్నామంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది.

జగన్ ప్రభుత్వంలోనే వశిష్ట వంతెన నిర్మిస్తాం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కచ్చితంగా వశిష్ట వారధి కట్టి తీరుతుంది. ఈపాటికే పనులు ప్రారంభమయ్యేవి. కానీ ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించాయి. కోర్టులకు వెళ్లాయి. ఏదీ ఏమైనా వశిష్ట వంతెన గోదావరి జిల్లాల ప్రజల చిరకాల కోరిక. స్థల సేకరరణ కూడా పూర్తయ్యింది. భూమి తీసుకున్న రైతులకు చెల్లింపులు జరిగిపోయాయి. టెండర్ల దశకు పనులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే నిర్ణీత కాల వ్యవధిలో వశిష్ట వంతెన నిర్మాణం జరుగుతుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

రాజ్యాంగ వ్యవస్థలపైనే దాడి దుర్మార్గం



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

తణుకు: రాజ్యాంగ మౌలిక స్వరూపాలైన ఫెడరలిజం, సెక్యులరిజం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, స్వతంత్ర న్యాయవ్యవస్థలపై దాడి జరుగుతోందని, ఇలాంటి ప్రయత్నాలను తిప్పికొట్టాలని శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం, తణుకు స్టడీ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ కర్తవ్యాలు' అంశంపై నిర్వహించిన సదస్సులో లక్ష్మణరావు మాట్లాడారు. 2029 నాటికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన ఈ రాజ్యాంగాన్ని కొనసాగిస్తారా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ప్రాథమిక హక్కుల ద్వారా ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కల్పించాలని, సంక్షేమ రాజ్యస్థాపన జరగాలని, భారతదేశ భిన్నత్వమూ, సమగ్రత కాపాడబడాలని రాజ్యాంగం నిర్దేశించిందని, కానీ ఇప్పుడు రాజ్యాంగ వ్యవస్థలపైనే దాడి జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన సామాజిక న్యాయానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు మాట్లాడుతున్నారని, మైనారిటీ, దళితులపై దాడులు గత పదేళ్లలో పెరిగిపోయాయన్నారు. ప్రజల్లో మతపరమైన విభజన తెచ్చి ఓటు బ్యాంకు రాజకీయాలకు తెగబడుతూ సెక్యులర్ స్వభావానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పూర్తిగా మార్చే ప్రయత్నాలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి.దక్షిణామూర్తి, సామాజికవేత్త, తణుకు స్టడీ సర్కిల్ కన్వీనర్ డీవీవీఎస్ వర్మ, ఐలు ఉభయగోదావరి జిల్లాల కార్యదర్శి కామన మునిస్వామి, ఎండీ అబ్దుల్ రహమాన్, పేరూరి మురళీకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి జోరుగా చేరికలు

నరసాపురం రూరల్: పసలదీవికి చెందిన అగ్నికుల క్షత్రియ నాయకుడు, న్యాయవాది కొల్లాటి నాగరాజు (కేఎస్ఆర్) మరో పది మందితో కలిసి సోమవారం చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ప్రసాదరాజు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బంధన పూర్ణచంద్రరావు, ఆశిష్‌కుమార్, కొల్లి రాధాకృష్ణ, సంసాని మోహన్, కొల్లాటివ వరప్రసాద్, ఒడుగు సన్ని నాగార్జున పాల్గొన్నారు.

మత్స్యకారుల మద్దతు

నరసాపురం పొన్నపల్లి ప్రాంతంలో మూడు వలకట్ల సంఘాలకు చెందిన సుమారు 100 మంది మత్స్యకారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సోమవారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు తమ మద్దతు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం పాటుపడిందని వారంతా ముక్తకంఠంతో తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాదరాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. మద్దతు పలికిన వారిలో కొండాలమ్మగుడి ప్రాంతం, బుడ్డిగరేవు ప్రాంతం, నవరసపురం ప్రాంతాలకు చెందిన వలకట్ల సంఘాలకు చెందిన మత్స్యకారులు ప్రసాదరాజుకు మద్దతు తెలిపారు. తిరుమాని గోవిందు, బర్రి సుబ్బారావు, తిరుమాని స్వామి, నాటిన కొండలరావు, మూపిటి శ్రీరాములు, బొడ్డు బండిరాజు ఉన్నారు. నాయకులు పీడీ రాజు, రెడ్డప్ప ధవేజి, అంద్రాజు చల్లారావు, మల్లాడి బుజ్జి, బర్రి జయరాజు ఉన్నారు.

ఎమ్మెల్యే గ్రంధి సమక్షంలో..

భీమవరం: భీమవరం టుటౌన్‌లోని టీడీపీ 33వ వార్డు అధ్యక్షుడు సిరియాల నాగేశ్వరరావు తన అనుచరులతో సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రౌతు హరిబాబు, వేగేశ్న వెంకట సత్యనారాయణరాజు, కలిగి విజయగాంధీ, సన్నాసి మోహనరావు, చీరాల వెంకట సుబ్బారావు, అడపా గణేష్ కుమార్, పట్నాల చిట్టిబాబు, సిహెచ్ బ్రహ్మానందం, పి కళ్యాణ్, టి వెంకటేశ్వరరావు, జి లోకేష్, ఆర్ వి నాగేశ్వరరావు తదితరులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు గ్రంధి బాలాజీ, ఏఎస్ రాజు, అభిరుచి రఘు, ముత్యాల బుజ్జి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన నాయకులు

పవన్‌కల్యాణ్‌పై భ్రమలు తొలగి జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతుండడం మంచి పరిణామమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం పంజా వేమవరం జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు పంజా హేమంత్ ఆధ్వర్యంలో జనసేన నాయకులు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పంజా సాయిరామ్, తోట వీరబాబు, పంజా హనుమంతు, వాకల శ్రీనివాస్, పంజా నాగు తదితరులకు ప్రభుత్వ విప్ శ్రీనివాస్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పంజా జానకీరామయ్య, పంజా శ్రీనివాస్, పంజా సురేష్, కడలి శ్రీను, పంజా సాంబశివరావు, ఎ.కిషోర్‌కుమార్, పంజా సూరిప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజు సమక్షంలో..

పెనుగొండ: దొంగరావిపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు పితాని ప్రకాశ్‌రావు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం రాత్రి పెనుగొండ కళాశాల కూడలిలో పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో వైఎస్ జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారని శ్రీరంగనాథరాజు అన్నారు. పార్టీ విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ నల్లిమిల్లి బాబిరెడ్డి, పార్టీ నాయకులు పెచ్చెట్టి జేమ్స్, పితాని ప్రసాద్, కుడిపూడి రామకృష్ణ, కాపిశెట్టి మణికంఠ, పులిదిండి వెంకటేశ్వరరావు, పలివెల శ్రీను పాల్గొన్నారు.



పొన్నపల్లిలో ప్రసాదరాజుకు మద్దతు తెలియజేస్తున్న వలకట్ల సంఘాల మత్స్యకారులు



ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన కొల్లాటి నాగరాజు



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



పెనుగొండలో శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ప్రకాశ్

గాజు గ్లాస్ కోసం పోటీ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సమయం ముగిసే సరికి 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో 10 మంది పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన వారు కాగా, మిగిలిన ఐదుగురు నాన్ లోకల్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. వీరిలో భీమవరం మండలం వీరవాసరం నుంచి ఇద్దరు, కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం నుంచి ఒకరు, కోనసీమ జిల్లా రాజోలు మండలం నుంచి ఒకరు, ఆచంట మండలం నుంచి ఒక అభ్యర్థి ఉన్నారు. జనసేన పోటీ ఉన్న నియోజకవర్గాల్లో ఆ పార్టీకి గాజు గ్లాస్ గుర్తు కేటాయించారు. జనసేన పోటీలో లేని నియోజకవర్గాల్లో గాజు గ్లాస్ ఓపెన్ సింబల్ కావడంతో స్వతంత్ర అభ్యర్థులకు ఆ గుర్తును ఏర్పాటు చేశారు. దీంతో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గాజు గ్లాస్ గుర్తు కోసం తమ అనుచరులతో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేయించారు. టీడీపీకి నాయకులకు చెందిన పి.జాన్సన్ స్వతంత్ర అభ్యర్థికి గ్లాస్ టంబ్లర్ సింబల్ రావడంతో ఆనందోత్సాహలతో ఉన్నారు. అభ్యర్థుల లిస్ట్‌లో గ్లాస్ టంబ్లర్ సింబల్ 13వ ప్లేస్‌లో వచ్చింది.



టీడీపీ నాయకులు నామినేషన్ వేయించిన జాన్సన్‌కు గాజు టంబ్లస్ గుర్తు కేటాయించిన దృశ్యం

క్లుప్తంగా

మజ్జిగ వితరణ



జువ్వలపాలెంలో మజ్జిగ వితరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తాడేపల్లిగూడెం సభ్యులచే సోమవారం జువ్వలపాలెం ప్రధాన రహదారిలో మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యక్షురాలు పచ్చిపులుసు నాగ శారదా రాణి, సెక్రటరీ మాటూరి శిరీష, కోశాధికారి కొల్లా రోజా ఉపాధ్యక్షురాలు వంకదారు రాణి జ్యోతిలు మాట్లాడుతూ మహాసభ ఆధ్వర్యంలో కోతిబొమ్మ సెంటర్ సాయిబాబా ఆలయం వద్ద ఇతర ప్రాంతాలలో వేసవికాలం అంతా చలివేంద్రాలలో మజ్జిగ వితరణ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ విద్యా ప్రోత్సాహ సేవలు అభినందనీయమని జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజులు అన్నారు. లయన్స్ కార్యాలయంలో డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో సోమవారం ఇటీవల పదో తరగతి ఫలితాలలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు దాత పదం కుమార్ గుప్తాచే విద్యా ప్రోత్సాహంతో బహుమతులు అందజేశారు. విద్యార్థినీలు నల్లా ప్రియ, లక్ష్మి సాయి ప్రసన్నలకు సత్కారం చేసి, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కాళ్ళ గోపికృష్ణ, ఎం.ఎం.ప్రసాద్, సతీష్, కార్తీక్, అనూష, విశిష్ట లియో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలి



పట్టింపాలెం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, సాగులో ఖర్చులు తగ్గించుకోవాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం పీసీ డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు అన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం మండలంలోని పట్టింపాలెం గ్రామంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడారు. అనంతరం రైతుల సమస్యలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. టీవోటీ డాక్టర్ రజిత, ప్రొఫెసర్ డాక్టర్ కే.వసంత భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కొమ్ముగూడెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రాంతంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు పర్యటించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుణపాలు, పారలకు సాన పట్టడానికి గతంలో రూ.50లు ఇచ్చేవారని కూలీలు ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై సోమరాజు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే సాన పట్టడానికి సొమ్ములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కృష్ణమూర్తి, వెంకట్రావు, చింతారావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల ఆశీర్వాదం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- పెంటపాడు మండలంలో జోరుగా ప్రచారం





దర్శిపర్రు గ్రామంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల, దర్శిపర్రులో మహిళల హారతులు

పెంటపాడు: సోమవారం పెంటపాడు మండలంలోని దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, పత్తిపాడు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనకసుందర్రావులతో కలసి ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూలేని అభివృద్ధి జగనన్న హయాంలోనే జరిగిందన్నారు. పథకాలు పొందిన పేదలు, మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కోట్లాది కుటుంబాలకు జగనన్న మేలు చేసారన్న సంగతి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. జగనన్న చేసిన అభివృద్ధి జ్ఞాపకాన్ని ఏ కూటమి తొలగించలేదన్నారు. రాష్ట్రాన్ని 14 ఏళ్లు పరిపాలించానని గొప్పలకు పోతున్న చంద్రబాబు అండ్ కూటమిని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. పలు గ్రామాల్లో కూడళ్లలో ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు మహిళలు, హారతులు ఇచ్చారు. యువత రోడ్ షోలు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనకసుందర్రావులు మాట్లాడుతూ జగనన్న రాష్ట్ర ప్రజలకు చేపట్టిన పథకాలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు, ఉప్పులూరి వరలక్ష్మి, జిల్లా, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, పార్టీ నాయకులు వీర్ల గోవింద్, పెన్నాడ సూరిబాబు, దర్శిపర్రు సొసైటీ అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, రాచర్ల గ్రామ సర్పంచ్ వాకా దుర్గాభవాని, సొసైటీ అధ్యక్షులు కుంచే సబ్రహ్మణ్యం, దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు, దెయ్యం శ్రీనివాసరావు, చింతన శారద, మడిపల్లి పుష్పావతి, గుండుమోగుల చిన్న, గుండుమోగుల మునీంద్ర, వీర్ల వెంకటేష్, వీర్ల ధనరాజు, సత్యనారాయణ, చింతన నారాయణరావు, రాచర్ల, విప్పర్రు మాజీ సర్పంచ్‌లు డోకల కమలాకర్, పసల చంటి, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, అలంపురం సొసైటీ అధ్యక్షులు కొలనువాడ అన్నవరం(దత్తుడు), దేవ వెంకటరమణ, డెక్క పాటి రమణ, దర్శిపర్రు బాబి, గోకా వెంకటేశ్వరరావు, దాసి బాబు, మద్రే కృష్ణమూర్తి, దేవరశెట్టి రాంబాబు, ఉండ్రాజవరపు రాజు, పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో అన్ని వర్గాలకూ మేలు



ఆరవల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కుమ్మర శాలివాహన వెల్ఫేర్ కమిటీ సభ్యుడు చింతన్న

అత్తిలి: రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా బీసీ సామాజిక వర్గానికి పెద్దపీట వేసారని రాష్ట్ర కుమ్మర శాలివాహన వెల్ఫేర్ కమిటీ సభ్యుడు బిరుదకోట చింతన్న అన్నారు. సోమవారం సాయంత్రం అత్తిలి మండలం ఆరవల్లి, మంచిలి, అత్తిలి, బల్లిపాడు, తిరుపతిపురం గ్రామాల్లో రాష్ట్ర శిల్పకళా అసోసియేషన్ అధ్యక్షుడు పెనుగొండ కరుణాకర్ వడయార్‌తో కలిసి కుమ్మర శాలివాహన కుటుంబాలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా చింతన్న మాట్లాడుతూ మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సంఘ సభ్యులంతా రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి, తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు.

నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్

- చెప్పాడంటే చేస్తాడంతే అనే నమ్మకం కలిగించిన ఘనం
- తణుకులో ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి



తణుకు 17వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి



తణుకులో మెడికల్స్, ల్యాబ్స్ అసోసియేషన్‌ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: నేటి రాజకీయాల్లో నిజాయితీ, నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 4,5,6,17 వార్డుల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై చెప్పాడంటే చేస్తాడంతే అనే నమ్మకం ప్రజల్లో కలిగిందని అన్నారు. 2024 ఎన్నికలకు కూడా చేయగలిగిన హామీలను మాత్రమే మేనిఫెస్టోలో పెట్టి ఎన్నికలకు సిద్ధమయ్యారని అన్నారు. చంద్రబాబు మాత్రం కేసుల నుంచి బయటపడేందుకు అడ్డదారిలో సీఎం అయిపోవాలని ఆచరణకు సాధ్యం కాని హామీలను గుప్పించి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని స్పష్టం చేశారు. చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో ఈ సంక్షేమాన్ని ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. అందిన కాడికి దోచుకోవాలనే తపనతోనే సంక్షేమం ఇవ్వలేకపోయాడని ఎద్దేవా చేశారు. మీకు ఎవరు మంచి చేశారో ఆలోచించి ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్ కుమార్, మంగెన సూర్య, నూకల కనకదుర్గ, సుద్దుల పాండు, తిర్రే విజయకృష్ణ, కారుమంచి యోహాన్, కారుమంచి మిత్ర, ఉండ్రాజవరపు గీత, రాజశేఖర్, దాసి రత్నరాజు, మండ సూరిబాబు, కట్టా కిషోర్, ఆకుల కిరణ్, కర్రి గంగాధర అప్పారావు, షేక్ ఫహీమా, శకుంతల, చంద్రకళ పాల్గొన్నారు.

చేసిన మంచిని గుర్తించండి..

తణుకు అర్బన్: కులం, మతం పార్టీ బేధాల్లేకుండా అన్ని వర్గాలకు మంచి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకు మెడికల్ హాలులో మెడికల్ అసోసియేషన్, ల్యాబ్స్ అసోసియేషన్‌లతో ఆదివారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వం చూపించిన చొరవను మెడికల్ విభాగమంతా గమనించాలని, లక్షలాది మంది ప్రాణాలను కాపాడుకోగలిగామని చెప్పారు. అంతేకాకుండా మెడికల్ యాజమాన్యాలు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వెసులుబాట్లు కల్పించామని గుర్తుచేశారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి నాతోపాటు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫణి, కార్యదర్శి రాము, ల్యాబ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వినయ్, ఉపాధ్యక్షుడు గాదంశెట్టి జయకృష్ణ, అసోసియేషన్‌ల నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం

తణుకు టౌన్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం రాత్రి తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాలు అహర్నిశలు శ్రమించారని తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపిస్తే ప్రతీ పథకం ఇంటి గుమ్మం వద్దకే చేరుతుందన్నారు. వేల్పూరు గ్రామాభివృద్ధికి గతంలో టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 30 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేల్పూరు గ్రామానికి రూ. 150 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, పంచాయితీ సభ్యుడు రెడ్డి సత్తిరావు, ఎంపీటీసీలు చుంద్రు శ్యామల, విజయ దుర్గ, రెడ్డి హైమా, తాడిపర్తి సుజాత, కత్తుల జస్పాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే బీసీల అభివృద్ధి



రేలంగిలో బీసీ గౌడ సంఘ సేవలో పాల్గొన్న మంత్రి కారుమూరి

ఇరగవరం: బీసీలకు పెద్ద పీట వేసింది సీఎం జగన్ మోహన్ రెడ్డి అని కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఇరగవరం మండలంలోని రేలంగిలోని గౌడ సంఘ ఆధ్వర్యంలో మెంటలాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీసీలు మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపాడు సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స రామభద్ర రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, మైనం పాము, కామన ఏడుకొండలు, వీరమల్లు రాము, వీరమల్లు గణపతి, చేబ్రోలు పెద్ది రాజు బొల్లా బెనర్జీ పాల్గొన్నారు.

బొలిశెట్టిని ప్రజలు విశ్వసించడం లేదు

వైఎస్సార్ సీపీ నేత గుండుబోగుల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్: జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ దౌర్జన్యమే వృత్తిగా ఆర్థిక బలాన్ని పెంచుకుని ఎదిగాడని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగేశ్వరరావు (నాగు) విమర్శించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం తనపైన, తన మిత్రులైన యడ్లపల్లి వీరన్ననాయుడు, వలవల సూరిబాబుపై బొలిశెట్టి తన మనుషులతో హత్యాయత్నానికి యత్నించాడని ఆరోపించారు. ఈ విషయంపై అప్పట్లో తన తల్లికి ఇచ్చిన మాట కోసం మేము ప్రతీకార చర్యలకు పాల్పడలేదని అన్నారు. కొందరిని జత చేసుకొని రౌడీయిజం, గూండా గిరి, సెటిల్‌మెంట్లు చేస్తూ ఆర్థికంగా ఎదిగిన బొలిశెట్టిని గూడెం ప్రజలు విశ్వసించడం లేదన్నారు. జనసేన అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటూ కొట్టు సత్యనారాయణ నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2004లో మొదటిసారి ఎమ్మెల్యేగా అధికారం చేపట్టిన కొట్టు తాడేపల్లిగూడెంలో, దేశంలోను రెండవదిగా పేరుగాంచిన వైఎస్సార్ ఉద్యానవర్సిటీని స్థాపించారన్నారు. వ్యాపారరంగంతో పాటు విద్యారంగంలో జాతీయస్థాయిలో తాడేపల్లిగూడెం పేరు మార్మోలా చేసిన ఘనత కొట్టుకే దక్కుతుందన్నారు. తాడేపల్లిగూడెంలో వందేళ్ల పాటు నీటి ఎద్దడి రాకుండా రెండవ సమ్మర్ స్టోరేజి ట్యాంక్ నిర్మాణం చేపట్టారన్నారు. సుమారు రూ.1,200 కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. బొలిశెట్టి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో తాడేపల్లిగూడెంను అన్ని రంగాల్లోనూ ఉన్నతస్థాయికి చేర్చాలని కృషి చేసిన ఆనాటి దేవదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావుకు అడుగడుగునా అడ్డుపడుతూ అభివృద్ధిని నీరుగార్చారన్నారు. దీంతో కూటమి అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచే అవకాశాలు లేవన్నారు. కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, తెన్నేటి జగ్జీవన్, చెన్నా జనార్దన్ మాట్లాడారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం



అత్తిలి: కుమ్మరవీధిలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో ఓట్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు



తణుకు టౌన్: పైడిపర్రులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారాలు



తణుకు టౌన్: మండపాకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు



పెంటపాడు: ప్రజలతో మాట్లాడుతున్న కాంచన, ఎంపీపీ హైమావతి



తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో ప్రచారం చేస్తున్న కొట్టు రాజేష్



ఇరగవరం: రేలంగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అత్తిలి: అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. సోమవారం అత్తిలి రజకవీధి, కుమ్మరవీధి, సంతానగోపాలస్వామిగుడివీధిలలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పోలినాటి చంద్రరావు, గారపాటి నాగరాజు, రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సతీష్, తమ్మాబత్తుల రాము, రంభ రాంబాబు, దాసరిశ్రీను పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలను నమ్మొద్దు

తణుకు టౌన్: ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ కూటమి ఇచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కోరారు. సోమవారం సాయంత్రం తణుకు పైడిపర్రులోని పలు వార్డులలో ఆయన వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందించారని తెలిపారు. రాబోయే ఎన్నికలలో తణుకు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ, నాయకులు, చినిమిల్లి సాంబశివరావు, కొత్తపల్లి చరణ్, కంచుమర్తి విశ్వేశ్వరరావు, జ్యాది తమ్మయ్య నాయుడు, త్రినాథ్, కాసా ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు. మండపాకలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు, నాయకులు పెండ్యాల మణికంఠ, రామారావు పాల్గొన్నారు. తేతలిలో కూడా గ్రామ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడులో కేఎస్ఎన్ కుటుంబీకుల ప్రచారం

పెంటపాడు: వైఎస్సార్ ప్రభుత్వంతోనే సంక్షేమరాజ్యం మరలా రానుందని, ప్రజలు తప్పక జగనన్నను, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను తప్పక ఆశీర్వదించాలని కొట్టు సత్యనారాయణ తనయ కాంచన్ పేర్కొన్నారు. ఆమె సోమవారం సాయంత్రం పెంటపాడులో ఎంపీపీ దాసరి హైమావతి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి అంజిరెడ్డి, కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, కొవ్వూరి బాస్కరరెడ్డి, దేవాబత్తుల బాబి, ఏఎంసీ డైరెక్టర్లు సలుమూరి ప్రకాష్, కర్రి వరహాలరెడ్డి, కర్రి ప్రియాంక చదలవాడ శ్రీనివాస్, ఉండ్రాజవరపు గోపి, రెడ్డి సంఘ సభ్యులు, నల్లమిల్లి అప్పిరెడ్డి, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

తణుకు టౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్వర్యంలో ఎస్సీ సెల్ నాయకులు, తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఎస్సీ ఏరియాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం రాత్రి తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకీ ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు మండపాక గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కత్తుల జస్పాల్, నాయకులు, చదలవాడ యల్లాజీరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో రాజేష్ ఇంటింటా ప్రచారం

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలో ప్రజలకు భరోసా ఇచ్చిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అని కొట్టు బాల రాజేష్ పేర్కొన్నారు.స్థానిక 33 వార్డులో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు బాల రాజేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని తెలిపారు.

ఇంటింటా వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం

ఇరగవరం: మండలంలోని ఇరగవరం గ్రామంలో సోమవారం మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం కావాలంటే తప్పనిసరిగా మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఇరగవరం సొసైటీ అధ్యక్షులు చవ్వాకుల శ్రీనివాస్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఏఎంసీ ఉపాధ్యక్షులు మమిడి శెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షులు కుడిపూడి నాగ సత్యనారాయణ, వీరవల్లి యుగంధర్, పాలా పాలేశ్వరరావు, గనసాల నాగరాజు పాల్గొన్నారు.